DD9 వార్త
తెలుగు దినపత్రిక
శనివారం 04-04-2026

# నార్సింగిలో భారీ భూకబ్జా మోసం బట్టబయలు

- నకిలీ పత్రాలతో కోట్ల రూపాయల దందా
- తక్కువ ధరకే ప్లాట్ అంటు బురిడి కొట్టిస్తున్న మోసగాళ్ళు
- ప్రజలకు నార్సింగి పోలీసుల సూచన

7






# ముంచుకొస్తున్న ముప్పు

## ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఇసుక రవాణా

- శిథిలవస్థల్లో రాళ్ళవాగు వంతెన పై ఇసుక లారీలకు అనుమతి
- నిత్యం జన సంచారం లో జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులు
- తొలుత సాధారణ వాహనాలకు సైతం నిషేదించిన అధికారులు
- నేడు కాసుల కోసం కక్కుర్తి పడి ఓవర్లోడ్ ఇసుక లారీలకు అనుమతులు అంటూ విమర్శలు
- అధికారుల ధన దాహంతో ప్రమాదపుటంచుల్లో
- వెంకటాపురం వాజేడు రోడ్లకు మరమ్మతులు లేవు
- అయినా సరే ఇసుక వాహనాలు నిలుపలేము
- చర్ల ఇసుక ర్యాంపు పంచాయితీతో ముదిరిన వివాదం



2

భద్రాచలం నియోజకవర్గంలోని వెంకటాపురం, వాజేడు మండలాల్లో ప్రజల ప్రాణాలపై ముప్పు మేఘాలు కమ్ముకుంటున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న రాళ్లవాగు వంతెనపై ఓవర్లోడ్ ఇసుక లారీలకు అనుమతులు ఇవ్వడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నిత్యం జన సంచారం ఎక్కువగా ఉండే ఈ మార్గంలో ఎప్పుడైనా ఘోర ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. సాధారణ వాహనాలకు సైతం నిషేధం విధించిన అధికారులు, నేడు కాసుల కోసం కక్కుర్తి పడి ఇసుక లారీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పలు విమర్శలకు దారితీస్తోంది. అధికారుల ధన దాహమే ఈ పరిస్థితికి కారణమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏటూరునాగారం క్రైం డిడి 9 వార్త ఏప్రిల్ 02

# పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి

- చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తాం
- తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) హెచ్చరిక

6



# మేడారం నాసిరకం నిర్మాణాలకు సాక్ష్యం

- శిలలు రాలి పడి గాయపడిన బాలుడు
- ఏడేళ్ల బాలుడి ఎడమ కాలు తొలగించిన వైద్యులు
- బాలుడి విషాదంతో బయటపడిన నిర్మాణ లోపాలు

7





# ముంచుకొస్తున్న ముప్పు



## ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఇసుక రవాణా

8 భద్రాచలం నియోజకవర్గంలోని వెంకటాపురం, వాజేడు మండలాల్లో ప్రజల ప్రాణాలపై ముప్పు మేఘాలు కమ్ముకుంటున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న రాళ్లవాగు వంతెనపై ఓవర్లోడ్ ఇసుక లారీలకు అనుమతులు ఇవ్వడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నిత్యం జన సంచారం ఎక్కువగా ఉండే ఈ మార్గంలో ఎప్పుడైనా ఘోర ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. సాధారణ వాహనాలకు సైతం నిషేధం విధించిన అధికారులు, నేడు కాసుల కోసం కక్కుర్తి పడి ఇసుక లారీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పలు విమర్శలకు దారితీస్తోంది. అధికారుల ధన దాహమే ఈ పరిస్థితికి కారణమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- శిథిలవస్థల్లో రాళ్ళవాగు వంతెన పై ఇసుక లారీలకు అనుమతి
- నిత్యం జన సంచారం లో జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులు
- తొలుత సాధారణ వాహనాలకు సైతం నిషేదించిన అధికారులు
- నేడు కాసుల కోసం కక్కుర్తి పడి ఓవర్లోడ్ ఇసుక లారీలకు అనుమతులు అంటూ విమర్శలు
- అధికారుల ధన దాహంతో ప్రమాదపుటంచుల్లో
- వెంకటాపురం వాజేడు రోడ్లకు మరమ్మతులు లేవు
- అయినా సరే ఇసుక వాహనాలు నిలుపలేము
- చర్ల ఇసుక ర్యాంపు పంచాయితీతో ముదిరిన వివాదం
- ఇసుక ర్యాంపు నిర్వాహకుల నిరసనతో భద్రాచలం మీదుగా వెళ్తున్న లారీలను మరలించిన అధికారులు
- మాకొద్దు ఈ ఇసుక లారీలు రవాణా అంటూ గతంలో ఆలుబాక లో నిరసన
- అధికారుల హామీ తో వెనుతిరిగిన ఇసుక లారీలు
- అదునుచూసి మళ్లీ వెంకటాపురం వైపుకు తిప్పిన నిర్వాహకులు
- ఆందోళనకు సిద్ధం అంటున్నా వెంకటాపురం వాజేడు వాసులు
- రోడ్లను బ్రిడ్జి లను బాగుచెయ్యండి వాహనాలను మరలించమని విజ్ఞప్తి

**వెంకటాపురం,ఏప్రిల్ 03,డిడి9 వార్త**

భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లా శివారు ప్రాంతం అయిన భద్రాచలం అసెంబ్లీ పరిధిలోని వెంకటాపురం మండలం యాకన్నగూడెం వద్ద రాళ్లవాగు వంతెన శిథిలావస్థకు చేరుకుని ప్రమాదాలకు నిలయంగా మారింది ఈ క్రమంలోనే లారీల రాకపోకలు కొనసాగించడం ప్రజల్లో భయాందోళన రేపుతోంది ఏకన్నగూడెం నుండి జగన్నాథపురం వై జంక్షన్ వరకు రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారీ లారీల రాకపోకల వల్ల దుమ్ముతో ప్రజలు అనారోగ్యానికి గురవుతుండగా, ఇప్పటికే పలు ప్రమాదాల్లో ప్రాణ నష్టం కూడా సంభవించింది.భద్రాచలం నియోజకవర్గంలో సీతమ్మధార ప్రాజెక్టు కింద దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ఇసుక పూడిక తొలగింపు పనులకు 2024లో అనుమతులు ఇవ్వడంతో భారీగా ఇసుక రవాణా కొనసాగుతుంది. ఇసుకను టీజీఎండిసి ఆన్లైన్ విధానంలో లారీల ద్వారా వెంకటాపురం, వాజేడు మండలాల మీదుగా హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో వెంకటాపురం మండలం యాకన్న గూడెం వద్ద రాళ్లవాగు వంతెన కూలిపోవడంతో సమస్యలు తలెత్తాయి. స్థానిక కాంట్రాక్టర్ తాత్కాలికంగా వంతెన పక్కన మట్టి రోడ్డు ఏర్పాటు చేసి ఇసుక రవాణాలను కొనసాగించడం వల్ల పరిస్థితి మరింత విషమించింది. అదేవిధంగా ఏకన్నగూడెం నుండి జగనాథపురం వై జంక్షన్ వరకు రహదారులు అన్నీ పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. లారీల రాకపోకల వల్ల ఎగిసి పడుతున్న దుమ్ముతో ప్రజలు అనారోగ్యానికి గురవుతుండగా, పలువురు ప్రమాదాల్లో ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో గత నవంబర్ నెలలో వెంకటాపురం వాజేడు మండలాల ప్రజలు ఆలుబాక గ్రామంలో ఇసుక లారీలను అడ్డుకొని భారీ నిరసన చేపట్టారు. డైవర్షన్ రోడ్డుకు గుంతలు తవ్వి లారీల రాకపోకలను నిలిపివేశారు. దీంతో చర్ల మండలానికి సంబంధించిన ఇసుక ర్యాంపులకు చెందిన లారీలు భద్రాచలం మీదుగా దూర ప్రాంతాలకు రవాణా చేయడం మొదలుపెట్టాయి. అయితే ఇటీవల శ్రీరామనవమి సందర్భంగా నాలుగు రోజులపాటు మళ్లీ వెంకటాపురం వాజేడు మార్గాలలో లారీ రవాణాకు అనుమతులు ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. ఇదే అవకాశం గా తీసుకున్న సదరు కాంట్రాక్టర్, స్థానిక ప్రజలను ప్రేరేపిస్తూ మళ్ళీ ఇసుక లారీల రవాణాను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపణలు వెల్లి వెత్తుతున్నాయి. రోడ్లు, బ్రిడ్జి సమస్యలపై స్పందించని అధికారులు, ప్రభుత్వంలోని పెద్దలు కాంట్రాక్టర్ కి మద్దతిస్తున్నారనికి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా పూర్తికాని వంతెనపై లారీల రవాణా చేపట్టడం ప్రమాదకరమని ప్రజలు హెచ్చరిస్తున్నారు. రోడ్డు, వంతెన పూర్తయ్యే వరకు భద్రాచలం మార్గంలోనే ఇసుక లారీలను నడపాలని లేకపోతే రెండు మండలాల ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని స్పష్టం చేస్తున్నారు.









# మాజీ మంత్రి హరీష్ రావు రాకతో బీఆర్ఎస్ శ్రేణులు బ్రహ్మరథం

- **మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికిన నేతలు.**
- **కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్,ఈట గణేష్, రాంబల్ నాయక్,తదితర అగ్ర నేతలు హాజరయ్యారు.**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి డిడి9వార్త(ఏప్రిల్03):::**

కోడంగల్ నియోజకవర్గం కోస్గి మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో వెలసిన శ్రీ గురు లోకానందు సంత్ మహారాజ్ దేవస్థాన జాతర ఉత్సవాలకు వెళ్తున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత తన్నీరు హరీష్ రావుకు షాద్‌నగర్ పట్టణంలో పార్టీ శ్రేణులు బ్రహ్మరథం పట్టాయి. హైదరాబాద్ నుండి కన్వాయ్‌లో బయలుదేరిన హరీష్ రావుకు, షాద్‌నగర్ బైపాస్ రోడ్డులోని పారడైస్ హోటల్ సమీపంలో మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో ముఖ్య నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. షాద్ నగర్ చేరుకున్న ఆయనకు అంజయ్య యాదవ్ తమ పార్టీ నేతలతో కలిసి శాలువా కప్పి, పూలమాలలతో సాదరంగా ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే పిలుపు మేరకు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కొత్తూరు, నందిగామ, కేశంపేట, కొందుర్గు, ఫరూఖ్ నగర్,చౌదరిగూడ మండలాల నుంచి భారీగా కార్యకర్తలు తరలివచ్చారు. హరీష్ రావు రాకతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. బీఆర్ఎస్ జిందాబాద్. హరీష్ రావు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనపై పూల వర్షం కురిపించారు. ఈ స్వాగత కార్యక్రమం అనంతరం, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కూడా హరీష్ రావుతో కలిసి తిమ్మారెడ్డిపల్లి జాతర ఉత్సవాలకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఫరూక్ నగర్ మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, రాష్ట్ర సహకార సంఘం మాజీ చైర్మన్ రాజ వరప్రసాద్,ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు ,మిట్టు నాయక్, రాంబల్ నాయక్, షాద్నగర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నటరాజ్,మాజీ కౌన్సిలర్లు, కౌన్సిలర్లు, నియోజకవర్గ స్థాయి ముఖ్యనాయకులు,ప్రజాప్రతినిధులు,అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు..

# మేడారం ఘటనకు మంత్రి సీతక్క, పొంగులేటి, కొండా సురేఖదే బాధ్యత

- **రెడ్కో మాజీ చైర్మన్ వై. సతీష్ రెడ్డి**
- **ఒక కాలు పూర్తిగా కోల్పోయి.. మరో కాలు విరిగిపోయి దయనీయ స్థితిలో బాలుడు యువన్**
- **పది వేలు ఇచ్చి చేతులు దులుపుకున్న సర్కారు**
- **కాసులు, కమిషన్లకు కక్కుర్తి పడి మేడారంలో నాసిరకం పనులు**
- **బాలుడి జీవితం అంధకారమవడానికి ముమ్మాటికి ముగ్గురు మంత్రులదే బాధ్యత**
- **హాస్పిటల్ ఖర్చులు, బాలుడి తల్లిదండ్రులకు ప్రభుత్వ ఉద్యోగం, బాలుడికి కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్**

**డీ డీ 9 వార్త, ములుగు :**

మేడారం గద్దెల దగ్గర ప్రమాదానికి ముమ్మాటికి మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ బాధ్యత వహించాలని రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. హన్మకొండలోని హాస్పిటల్ లో ట్రీట్మెంట్ పొందుతున్న మేడాం పూజారి కుమారుడు.. బాలుడు యువన్‌ను ఆయన పరామర్శించారు. బాలుడి కుటుంబసభ్యులు తమ గోడు చెప్పుకుని కన్నీటి పర్యంతమయ్యారని ఆయన అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో, కాసుల కక్కుర్తితో ప్రమాదం జరిగి పసివాడు ఓ కాలును కోల్పోయి.. మరో కాలు విరిగిపోయి ఉంటే ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. మంత్రి సీతక్క వచ్చి పరామర్శించి రూ.10 వేలు చేతిలో పెట్టి చేతులు దులుపుకుని పోవడం దుర్మార్గమన్నారు. వందేళ్లు నిలిచిపోయేలా నిర్మాణాలు చేపడుతున్నామని గప్పాలు చెప్పుకుని.. గాలికి ఊడిపోయే నిర్మాణాలు చేపట్టారని సతీష్ రెడ్డి ఆరోపించారు.

కమిషన్లు పంచుకుని.. కాసుల కక్కుర్తితో వ్యవహరించిన మంత్రులు.. బాలుడిని ఆదుకునేందుకు ముందుకు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ తప్పు ఒప్పుకోవాలని.. ఆ పసివాడిని చూసి అయినా మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు.

బాలుడికి ప్రస్తుతం అయ్యే వైద్య ఖర్చులన్ని ప్రభుత్వమే భరించాలని.. హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయ్యాక.. అతడి భవిష్యత్ కోసం కూడా ప్రభుత్వం కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాలుడి తల్లిదండ్రులిద్దరు చదువుకున్న వారేనని.. వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాలుడు యువన్ ఒక కాలు పాదం పూర్తిగా తీసేయడంతో అతని భవిష్యత్ అంధకారంలో పడిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. మరో కాలు కూడా విరిగిపోవడంతో దానికి సర్జరీ చేశారన్నారు.



దీంతో బాలుడి భవిష్యత్ పూర్తిగా అంధకారమైపోయిందన్నారు.

అయిన వాటికి.. కాని వాటికి సిట్ లు.. సీబీఐసీడీలు అంటున్న రేవంత్ రెడ్డి.. మేడారం ఘటనపై సిట్ వేయాలని డిమాండ్ చేశారు. కాసులకు కక్కుర్తి పడి.. కమిషన్లు మింగేసి.. నాసి రకం పనులు చేసింది ఎవరు.? దానికి సహకరించింది ఎవరో తేల్చి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



# కర్ణవేదన కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్

**డీ డీ 9 వార్త, ములుగు :**

వెంకటాపూర్ మండలం లోని నర్సింగపూర్ గ్రామానికి చెందిన నా స్నేహితుడు కన్నెబోయిన సురేష్ కూతురి కర్ణవేదన కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించిన లక్ష్మీదేవిపేట గ్రామ సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్ అదే విధంగా నర్సింగపూర్ గ్రామ సర్పంచ్ కుమార్ ఉప సర్పంచ్ గొర్రె ఓదేలు,నారిశెట్టి రమేష్,అల్లం తిరుపతి తదితరులు ఉన్నారు.



## సిలువ యాగం వలననే
# మానవాళికి మోక్షం

- **కత్తి సదానంద్ పాల్**

**బోనకల్,ఏప్రిల్3,(డీడీ9 వార్త):**


యేసు క్రీస్తు సిలువ త్యాగం వలన,అయన పవిత్రమైన రక్తం చిందించుటం వలననే ఈ లోకంలో మానవాళికి రక్షణ వచ్చిందని,మనలో మనము అహంకారాన్ని,గర్వాన్ని తగ్గించుకొని, ప్రేమ,త్యాగం,సహనం గుణాలనుఅలవర్చుకోవాలని,సిలువ శ్రమలను గుర్తు తెచ్చుకొని ఒకరినొకరు పరస్పర సహకారంతో ఉండాలని,ఇతరుల చేత బాధింపబడుతున్నప్పుడు కూడా ఎదుటివారిని క్షమించమన్న సిలువలో యేసు పలికిన మాటను అందరూ అనుకరించాలని కత్తి సదానంద్ పాల్ అన్నారు గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం కలకోట తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆరాధనలో అయన పాల్గొన్నారు,మనుష్యులు అందరూ దేవుని పోలిన క్షమాగుణం కలిగి నిత్యజీవమును పొందుకొనటంవలన ఆయనతో పరలోకంలోనికి ఎత్తబడతామని దైవ జనురాలు కత్తి జయపాల్ అన్నారు ,సిలువ శ్రమలలో సహితం యేసు తన తల్లిని జ్ఞాపకం చేస్తూ తల్లి తండ్రుల భాద్యతలను చూడాలన్నారు ,ప్రతి విశ్వాసి చెడు దప్పికాలకు దూరంగా ఉంటూ ఆత్మీయ దప్పికను కలిగి ఉండాలని అనూష పాల్ అన్నారు,అనంతరం సిలువలో యేసు పలికిన ఏడు మాటలును గుర్తు చేసుకున్నారు, ఈ కార్యక్రమంలో సంఘ పెద్ద యంగల జీవరత్నం,తోటపల్లి సాల్మన్,యంగల అమరయ్య,గద్దల ముత్తయ్య, మాతంగి శ్రీను ,బరుగుల ఎంకయ్య,యంగల ఏసేపు, కొమ్ముగిరి నరేష్,యంగల ప్రదీప్,మాతంగి అశోక్, పలువురు సంఘ విశ్వాసులు పాల్గొన్నారు

# శంషాబాద్‌లో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధుడు అనుమానాస్పద మృతి

**రాజేంద్రనగర్ ఏప్రిల్ 03 డిడి 9 వార్త**

శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన కలకలం రేపింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.శంషాబాద్ మండలం చౌదర్‌గూడ గ్రామంలోని మూసా కాలనీలో నివసిస్తున్న రహీం ఉద్దీన్ ఖాన్ (80) అనే వృద్ధుడు ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు.గత 2014 సంవత్సరం నుంచి అదే కాలనీలో స్వంతంగా ఇల్లు కట్టుకుని నివసిస్తున్న అతని వద్దకు బంధువులు ఎవరూ రాకపోకలు లేవని స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా, గురువారం రాత్రి (ఏప్రిల్ 2) సుమారు 8:30 గంటల సమయంలో అతని ఇంటి నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో కాలనీ వాసులు అనుమానం వ్యక్తం చేశారు. వెంటనే కాలనీ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ కలాం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పలుమార్లు తలుపు తట్టినా స్పందన రాకపోవడంతో తలుపు బలవంతంగా తెరిచి లోపలికి వెళ్లి పరిశీలించారు. అక్కడ రహీం ఉద్దీన్ ఖాన్ మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది.మృతదేహంపై పురుగులు ఉండటం గమనించారు.3 నుంచి 4 రోజుల క్రితమే మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. గుండెపోటు లేదా ఇతర అనారోగ్య సమస్యల కారణంగా మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి,కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





## ముల్లంగి వారి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

**మణుగూరు.ఏప్రిల్ 3 (డి డి 9వార్త)**

ముల్లంగి శివారెడ్డి - పద్మావతి దంపతుల కుమార్తె శ్వేత వర్షిని మరియు ఉమేష్ చంద్ర న్‌ల వివాహ వేడుక హైదరాబాద్ లోని PSR శ్లోక కన్వెన్షన్ నందు ఘనంగా జరిగింది. ఈ శుభ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖశాంతులతో నిండిపోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకను మరింత ఆనందభరితంగా మార్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు, పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ భవనం కోసం సర్పంచ్ వినతి

**జనగామ ఏప్రిల్ 3(డిడి 9వార్త ) బ్యూరో**

రఘునాథపల్లి మండలం పరిధిలోని కుసుంబాయి తండా గ్రామ సర్పంచ్ కొర్ర స్వరూప రాజేందర్ నాయక్ స్థానిక స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ను హనుమకొండలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

గ్రామానికి పరిపాలనా సౌలభ్యం కోసం గ్రామపంచాయతీ భవనం అత్యంత అవసరమని వివరించి, వెంటనే మంజూరు చేయాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. అలాగే కుసుంబాయి తండా నుండి జాల్ తండ, రామన్నగూడెం వరకు బీటీ లింక్ రోడ్డు నిర్మాణం, గ్రామంలో సీసీ రోడ్లు, అభివృద్ధి నిధుల మంజూరు వంటి అంశాలను ప్రస్తావించారు.

సర్పంచ్ వినతిపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి సానుకూలంగా స్పందిస్తూ "పది రోజుల్లో గ్రామపంచాయతీ కార్యాలయం మంజూరు చేయించే బాధ్యత నా దే" అని హామీ ఇచ్చారు.

గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యేతో విస్తృతంగా చర్చించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు కొర్ర భారతి హుస్సేన్ నాయక్ పాల్గొన్నారు.

## గ్యాస్ కష్టాలతో కార్మిక కుటుంబాల ఇక్కట్లు

- **విధులకు గైర్హాజరు**
- **గ్యాస్ బ్లాక్ మార్కెట్ ను నియంత్రణ చేయ్యాలి.**
- **వై. రాంగోపాల్ AITUC మణుగూరు బ్రాంచి సెక్రటరీ ఆవేదన..**





**మణుగూరు. ఏప్రిల్ 3 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు.

సింగరేణి కార్మిక కుటుంబాలకు ఇండియన్,భారత్,HP గ్యాస్ సరిపడినంతగా సప్లయ్ కాకపోవడంతో ఇంట్లో మహిళలకు వంట చెయ్యాలంటే దుఃఖమే వస్తుందని, బాధ పడుతున్నారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మణుగూరు బ్రాంచ్ సెక్రటరీ రాంగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గుపొయ్యి కష్టాలు పోయాయి అనుకుంటే మళ్లీ అదే స్థితికి వచ్చే పరిస్థితి వుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) మణుగూరు బ్రాంచి సెక్రటరీ వై రాంగోపాల్ అన్నారు. ప్రస్తుతం వంటగ్యాస్ కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఆ ప్రభావం మణుగూరు సింగరేణి బొగ్గు బావులమీద క్యాంటిన్లలో కార్మికులకు అల్పాహారం అందించే పరిస్థితి లేదని అన్నారు.పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం ఇలాగే కొనసాగితే సింగరేణి ఉత్పత్తి పై ప్రభావం పడే అవకాశం వుందని ఆయన అన్నారు.కార్మికులకు కోసం తీసుకున్న గ్యాస్ డీలర్స్ కార్మికులకు హోమ్ డెలివరీ చెయ్యాలని బుక్ చేసుకున్న ప్రకారంగా సీరియల్ ప్రకారం గ్యాస్ అందించాలని సూచించారు. గ్యాస్ బ్లాక్ మార్కెట్ కు తరలిపోకుండా కార్మికులకు సక్రమంగా వంటగ్యాస్ అందేలా చూడాలని సింగరేణి యాజమాన్యన్ని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో, రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదని చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని, ఎక్కడ గ్యాస్ ఏజెన్సీల దగ్గరకు వెళ్ళినా నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయని ఆయన తెలిపారు.

## రెడ్డి సంధ్యారెడ్డి కి మండల రెడ్డి సంక్షేమ సంఘం ఘన సన్మానం

**గోవిందరావుపేట, ఏప్రిల్ 3( డి డి 9 వార్త)**

పసర గ్రామానికి చెందిన రెడ్డి సంధ్యారెడ్డి ని మండలం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు మండల కమిటీ అధ్యక్షులు సూది రెడ్డి జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో సంధ్యారెడ్డి ప్రతిష్ఠాత్మకమైన "శివంగి ఆత్మీయ పురస్కారం" అందుకున్న సందర్భంగా మండల కమిటీ సభ్యులు ఆమెను అభినందించారు. సన్మాన కార్యక్రమంలో సంఘ సభ్యులు సంధ్యారెడ్డిని శాలువాతో సత్కరించి, మిఠాయిలు అందజేశారు. ఆమె సమాజ సేవలో చేసిన సేవలు, ముఖ్యంగా మహిళా అభివృద్ధి కోసం చేసిన కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కొమురెల్లి భూమిరెడ్డి, అంతిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మిరియాల యాదగిరి రెడ్డి, రావుల సంపత్ రెడ్డి, కొమ్మూరు సంజీవరెడ్డి, మట్ట వెంకట పాపిరెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి, కర్ర సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న గాండ్ల సురేష్..

- **ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన శాంతి మార్గంలో పయనించాలని పిలుపు.**

**మణుగూరు.ఏప్రిల్ 3 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లోని ముత్యాలమ్మ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో గల ఏసుక్రీస్తు ప్రార్ధనా మందిరంలో శుక్రవారం నాడు గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా సమితిసింగారం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ గాండ్ల సురేష్‌హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రపంచానికి శాంతి సందేశాన్నిచ్చిన ఏసుక్రీస్తు ప్రభువు సిలువవేయబడిన రోజు గుడ్ ఫ్రైడే అని అన్నారు.ఏసుప్రభువు వారి శాంతి సందేశంతో ప్రపంచ మానవాళి సన్మార్గంలో,శాంతియుతంగా నడుచుకోవాలని, వారి జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ప్రేమ,అనురాగాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రార్ధనా మందిరం పాస్టర్ గారు, మరియు సంఘ సేవకులు పాల్గొన్నారు.



## అయ్యా ఏం సాధించారని ప్రజాపాలన పేరుతో గ్రామసభలు నిర్వహిస్తున్నారు..

**మణుగూరు. ఏప్రిల్ 3 (డి డి 9వార్త)**

కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన దగ్గరనుండీ ఈరోజు వరకు అర కొర పనులు తప్ప,ప్రజలకు ఉపయోగకరం అయినటువంటి ఏ ఒక్క కార్యక్రమము చేపట్టలేదని బిఆర్ఎస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు ఆరోపించారు. ఎన్నికల మానిఫెస్టో లో ఇచ్చినటువంటి ఆరు గ్యారంటీల అమలుతో పాటుగా 420 హామీలు కూడా ఏమాత్రం నెరవేర్చకుండా మంత్రులు,ఎమ్మెల్యేలు శంకుస్థాపనలకు,ప్రారంభాలకు మాత్రమే పరిమితమై ఇంకా ప్రజలను మోసం చేయడం కోసం ప్రయత్నిస్తున్నారని అన్నారు.యువకులకు,నిరుద్యోగులకు,రైతులకు,వృద్ధులకు,గృహిణులకు ఇచ్చినటువంటి ఏ ఒక్క హామీను కూడా నెరవేర్చలేదని, ఏదో చేసేసినట్టు కమిటీల పేరుతో నలుగురు కాంగ్రెస్ కార్యకర్తలను స్టేజీపై కూర్చోబెట్టి గ్రామపంచాయతీ లలో,మున్సిపాలిటీ వార్డుల్లో సభలకు వచ్చినటువంటి ప్రజలకు చేసినవి,చేయనివి మైకుల్లో ఊదరగొట్టి ప్రజాపాలన గ్రామసభలు అనే పేరుతో పబ్బం గడుపుతున్నారు అని ఆయన ఆరోపించారు. మణుగూరు మండలం లో ఏ ఒక్క గ్రామసభలో కూడా ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పిన పాపాన పోలేదు అని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పనితీరు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందని అన్నారు.ఇప్పటికైనా ఆడంబరాలు మరచి ప్రజలకు ఏమి చేయాలో, వారికి ఏం అవసరమో గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరిస్తే మంచిదన్నారు.లేకపోతే రానున్న రోజుల్లో ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల విషయంలో పూటకో మాట చెబుతున్నారని అన్నారు.అమాయకులైన పేదలకు ఇల్లు ఇచ్చి రోడ్డున పడేయకుండా సకాలంలో బిల్లులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.





## అశ్వారావుపేటలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

# ఎకనామిస్ట్ ఏనుగుల రాకేష్ రెడ్డి పర్యటన...

**అశ్వారావుపేట:ఏప్రిల్03(డిడి9 వార్త)**

అశ్వారావుపేట మండల BRS నాయకులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సంక ప్రసాద్ గారి మాతృమూర్తి సంక వరలక్ష్మి గారు కొద్ది రోజుల క్రితం స్వర్గస్థులు అయ్యారు. ఈరోజు అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు గారితో కలిసి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎకనామిస్ట్ ఏనుగుల రాకేష్ రెడ్డి వరలక్ష్మి గారి చిత్రపటానికి పులు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

అనంతరం కాసాని నాగ శేష పద్మ(చంద్ర మోహన్)గారి నివాసానికి వారి ఆహ్వానం మీరు వెళ్ళి స్థానిక నాయకులతో కాసేపు ముచ్చటించారు.అలాగే బిఆర్ స్ నాయకులు జజ్జువరపు శ్రీరామ్ మూర్తి గారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా మెచ్చా గారు తెచ్చిన పనులు తప్ప కొత్తగా తట్టెడు మట్టి కూడా పోసిన దాఖలాలు లేవని..మాటలకే తప్ప చేతల్లో ఏం లేదని... RTO కార్యాలయం గత ప్రభుత్వంలో తెస్తే నేడు అది మూత పడిన కనీసం పట్టించుకునే నాథుడు లేడని..100 రోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తామని



గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి నోట 420 హామీల ఊసే లేదని...గ్రామ సభలు కేవలం కాంగ్రెస్ పార్టీకి డప్పు కొట్టుకోవడానికి తప్ప ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చెయ్యలేదని...కొంతమంది అధికారులు కూడా కాంగ్రెస్ కి వత్తాసు పలికే పరిస్థితికి వచ్చారని..2028 లో తిరిగి 100 స్పీడ్ లో కారు దూసుకు వస్తుందని ....ఆ స్పీడ్ కి హస్తం పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.





# మొద్దులగూడెం గ్రామంలో పర్యటించిన జారె ఆదినారాయణ

- **సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ..**
- **గుడ్ ఫ్రైడే పురస్కరించుకొనిచర్చిల్లో ప్రార్థనలు..**
- **పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే...**

**అశ్వరావుపేట:ఏప్రిల్03 (డిడి 9 వార్త)**

అశ్వారావుపేట నియోజకవర్గ గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దమ్మపేట మండలం మొద్దులగూడెం గ్రామంలో పర్యటించి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు స్వయంగా వారి ఇండ్లకు వెళ్లి అందజేశారు గుజ్జుల కుమారి, గణపా గోపమ్మ, దొండపాటి జగన్మోహన్ రావు కి చెక్కులు అందించి వారి కుటుంబ యోగక్షేమాలను తెలుసుకున్నారు

**అనారోగ్య బాధితుల పరామర్శ**

దమ్మపేట మండలం మొద్దులగూడెం గ్రామ పర్యటనలో భాగంగా అనారోగ్యంతో బాధపడుతున్న ముసునూరి శ్రీనివాసరావు, నారం లక్ష్మయ్య, కుంచం మారేశ్వరరావు, బూరుగు పుల్లారావు, దొడ్డా వెంకటేశ్వరరావు గారి అబ్బాయి, లంకా కృష్ణ, చిన్న సత్యం గారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని ధైర్యం చెప్పారు

**మరణించిన కుటుంబాలకు పరామర్శ**

ఇటీవల మరణించిన కొలికిపోగు అప్పారావు, జుజ్జువరపు దుర్గమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

**గుడ్ ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు**

గుడ్ ఫ్రైడే సందర్భంగా మొద్దులగూడెం గ్రామంలోని స్థానిక చర్చిలో క్రైస్తవ సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు

**వివాహ వేడుకల్లో ఆశీస్సులు**

పర్యటనలో భాగంగా చిత్తారు శ్రీనివాసరావు గారి కుమార్తె వివాహ వేడుక, రెడ్డిమళ్ల వెంకటేశ్వరరావు గారి కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బేతం రుక్మిణి , కాంగ్రెస్ నాయకులు దొండపాటి రామారావు , మాదాల చంద్ర రావు ,గణప రాము , బొగ్గం యెహోషువ, కందుల వెంకటేశ్వరరావు, స్వర్ణాల శ్రీను , దొడ్డ శివయ్య , అనంతుల అయ్యప్ప , బొంతు రాజశేఖర్ , కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ,సర్పంచులు ,వార్డ్ మెంబర్స్, తదితరులు పాల్గొన్నారు .








# గ్రామంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు ప్రారంభం

- **సర్పంచ్ భూక్య సుమలత**

**గోవిందరావుపేట, ఏప్రిల్ 3 ( డి డి 9 వార్త ):**

పసర గ్రామంలో దోమల పెరుగుదలను అరికట్టేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక నివారణ చర్యలు ప్రారంభించారు. ఈ మేరకు కొత్తగా దోమల నివారణ పిచికారీ యంత్రాన్ని తెప్పించి, శుక్రవారం నుంచే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ భూక్య సుమలత తెలిపారు.

పెద్ద యంత్రం ద్వారా పొగ రూపంలో దోమలను నివారించే ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు.

గ్రామంలో దోమల సమస్యను పూర్తిగా నియంత్రించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ విధమైన నివారణ చర్యలను కొనసాగిస్తామని సర్పంచ్ భూక్య సుమలత స్పష్టం చేశారు.

గ్రామ ప్రజలు కూడా పరిశుభ్రత పాటిస్తూ, దోమల పెరుగుదలకు దారితీసే నీటి నిల్వలను తొలగించాలని ఆమె సూచించారు.



# మంగపేట మండలం రాజుపేటలో గుడ్ ఫ్రైడే సందర్భంగా సజీవ సిలువ మార్గం ప్రదర్శన

**మంగపేట ఏప్రిల్ 03డీడీ 9 వార్త**

మంగపేట మండలం రాజుపేట గ్రామంలో పునీత ఫ్రాన్సిస్ జేవియర్ చర్చ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వ తేదీన గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రీస్తు ప్రభువు శ్రమల చరిత్రను సజీవ సిలువ మార్గం (Way of the Cross) రూపంలో భక్తిశ్రద్ధలతో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘం విశ్వాసాన్ని ప్రతిబింబిస్తూ, యేసు క్రీస్తు నిజమైన దేవుడు అని, ఆయనను విశ్వసించిన ప్రతి ఒక్కరు పాపముల నుండి రక్షణ పొంది నిత్యజీవం పొందుతారని సందేశం ఇచ్చారు. ప్రజల పాపములను తనపై తీసుకొని సిలువపై మరణించి, వారికి పరలోక రాజ్యంలో స్థానం కల్పించాడని విశ్వాసాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమం ఫాదర్ చరణ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఆర్ఎంసి సిస్టర్స్, రాజుపేట సంఘ పెద్దలు, కాటూర్ మరియు మల్లారం గ్రామాల నుండి వచ్చిన విశ్వాసులు, యువతి యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి పరవశంలో మునిగిపోయారు.

ఈ సజీవ సిలువ మార్గం కార్యక్రమం గ్రామ ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను గుర్తు చేసింది.



# మానవతా దృక్పథంతో ముందడుగు – బాధిత కుటుంబానికి అండగా SRR ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

**పాలకుర్తి ఏప్రిల్ 01(డిడి 9 వార్త)**

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సన్నూర్ గ్రామానికి చెందిన నమోజు రాజు ఇటీవల ప్రమాదంలో గాయపడి హన్మకొండ గార్డియాన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు, సేవ దృక్పథంతో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి బాధితునికి అండగా నిలిచారు బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్న పరుపాటి శ్రీనివాస్ రెడ్డి తక్షణ సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసర సమయంలో ప్రజలకు అండగా నిలవడం తమ బాధ్యత అని తెలిపారు అలాగే భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు, నాయకులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు

# పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి – చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తాం

- **తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి హెచ్చరిక**

**రాజేంద్రనగర్ ఏప్రిల్ 03 డిడి 9 వార్త**

అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హసన్ నగర్ చౌరస్తా వద్ద పారిశుద్ధ్య కార్మికురాలిపై జరిగిన దాడి ఘటన ఆగ్రహాన్ని రేకెత్తించింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఏప్రిల్ 2 ఉదయం సుమారు 5:30 గంటల సమయంలో ఎన్. సత్యమ్మ (55) విధులు నిర్వహిస్తూ హసన్ నగర్‌లోని గ్రాండ్ హోటల్ సమీపంలో పారిశుద్ధ్య పనులు చేస్తోంది. ఈ సందర్భంగా చాయ్ కోసం హోటల్ సిబ్బందిని అడిగిన ఆమెపై అక్కడ ఉన్న ఓ గుర్తుతెలియని వ్యక్తి అసభ్య పదజాలంతో దూషించాడని



దీనిపై సత్యమ్మ స్పందించగా, ఆ వ్యక్తి ఆగ్రహంతో ఆమెపై దాడి చేసి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు. సంఘటనను గమనించిన శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రశ్నించినప్పటికీ,నిందితుడు సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. గాయపడిన కార్మికురాలు వెంటనే చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లగా, వైద్యులు చికిత్స అందించారు.ఈ ఘటనపై బహదూర్‌పుర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కాగా,ఎంఎల్‌సీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులపై దాడులు సహించబోమని స్పష్టం చేశారు.నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలా చేయని పక్షంలో అత్తాపూర్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులతో కలసి ఆందోళనకు దిగుతారని హెచ్చరించారు.



# వినాయకపురంలో బిర్రం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలకు పాలాభిషేకం చేసిన పామాయిల్ రైతాంగం...

**అశ్వరావుపేట:ఏప్రిల్ 03( డిడి9 వార్త)**



రాష్ట్రంలోని పామ్ ఆయిల్ రైతుల ఇంటా కాసుల పంట పండుతుంది మార్కెట్ పరిస్థితిలో అంతర్జాతీయ ముడి పామాయిల్ ధరలు బేరేజూ చేస్తూ తెలంగాణ ఆయిల్ పాడ్ తీసుకున్న తాజా నిర్ణయంతో తుమ్మల గారి కృషితో

రైతుల పాలిట కల్పవృషంగా మారిన పామాయిల్ గెలలు ధర 21546 నుంచి 1459 రూపాయలు పెరిగి 23005 రూపాయలు పెరిగిన సందర్భంగా వినాయకపురం రైతాంగం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారి చిత్ర పటానికి బిర్రం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పాలతో అభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తుమ్మల కృషితో పామాయిల్ పంట ధర పెరిగిందని కొనియాడారు. బిర్రం మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రభావం సాగుదారులపై పడకుండా సంస్థ తీసుకున్న ఈ నిర్ణయం క్షేత్రస్థాయిలో సత్ఫలితాలను ఇస్తుందని వ్యవసాయ మంత్రి తుమ్మల గారి సారవతోరాష్ట్రంలో ముఖ్యంగా మా ప్రాంతం అశ్వరావుపేట దమ్మపేట మండలాలలో ఇప్పటికే అధిక సంఖ్యలో పామాయిల్ తోటలు సాగుకి ముందుకొస్తున్నారు . పామ్ ఆయిల్ రైతులను ఆర్థికంగా ఉన్నత స్థానంలో నిలపాలని తుమ్మల గారి సంకల్పం ఈ ధరలు పెరుగుదలలో మరోసారి స్పష్టమైన ఆయిల్ ప్యాడ్ ప్రకటించిన ఈ భారీ ఊరటపై రాష్ట్ర వ్యాప్తంగా రైతంగం సంతోషం వ్యక్తం చేస్తున్నారు ఇది ముమ్మాటికి తుమ్మల గారి కృషి అని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప్పల మురళి.మరుతి వసంతరావు, నల్లపు రామారావు,ఉప్పల ప్రసాద్, పొట్టా రాజులు,బిర్రం ఉదయ్ కుమార్. రొయ్యల సత్యనారాయణ. ఉప్పల నాగు. సింగల్ దేవి దుర్గారావు. కక్కిరాల నాగరాజు. గాలి రాంబాబు. ఉప్పల దుర్గాప్రసాద్. ఉప్పల తాతారావు. ఆది ప్రశాంత్. ఇళ్ల సురేష్. . లోకం అశ్విని. ఉప్పల వెంకటరమణ. కక్కిరాల హరీష్. పోకల సాయి సుబ్రహ్మణ్యం. విర్నాల నరేష్. బేతం రాము. రెడ్డి సీతయ్య. నారం శివ. బత్తుల తిరుమలేష్. ఉప్పల చిన్ని, తదితరులు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# అడవిగ్రామాల్లో,,, అభివృద్ధి పనులు..!!

- **లవ్వాల,, మొండాలతొగులో తాగునీటి పనులు,,,**
- **గిరిజనులు ఇబ్బంది పడకుం డాచేతిపంపులు మరమ్మత్తు,,**
- **సర్పంచు మొగిలిపెల్లి రవిందర్తొ రవతొ తాగునీరందించె,,**
- **మా కొత్త హర్పంచు అభివృద్ధి లొ గ్రామాల్లొ ప్రగతి పనులు,,**
- **ప్రజాపాలనలో ప్రజాసమస్యలు పరిస్కారం,,,,**
- **వేసవిలొ తాగురు లేక వాగుల్లొ నీటినె తాగేదని గొత్తెలు తెలిపె**

**ఏటూరునాగారం క్రైం డిడి 9 వార్త ఏప్రీల్ 03**





అడవిగ్రామాలలో గిరిజనులు ఎసమస్యలకు ఇబ్బందులు పడకుండా కొత్తగా ఎన్నికైన సర్పంచు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను అమలు చేస్తున్నా రు,,తాడ్వాయి మండలంలొని లింగాల జి పి పరిధిలొకి వచ్చె లవ్వాల గ్రామం మండల కేంద్ర మునకు సమీపంలొ పస్రానుంచి తాడ్వాయికి వెళ్లి ప్రధానమైన 169 జాతీయ రహదారికి పక్కనె అడవిలొ ఉంటుంది రోడ్డు నుంచి 5 కిలొ మీటర్లు కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది కొంతకాలంగా ఇక్క డతాగునీటి ఎద్దడి నెలకుంది ఈసమస్యను గ్రామసభలొ తెలిపెను వెంటనె సర్పంచు మొగిలిపెల్లి రవిందర్ గ్రామపంచాయితి సిబ్బందితొ కలిసి లవ్వాలను సందర్శించెను చేతిపంపుల ను మరమ్మత్తు పనులు చేయించెను,,తాగునీరు వస్తుంది గ్రామస్తులు అభినందనలు తెలిపారు,,,

**మొండ్యాలతొగులొ తాగు నీటిపనులు,,,!!**

గొత్తెకోయలు నివశిస్తున్న మొండ్యాలతొగులొ సైతం తాగునీటి సమస్య నెలకుంది అడవిలొ ఉంటున్న వీళ్లకు ఇబ్బందికరంగా ఉండెను,, ఇక్కడ కూడా చేతి పంపుల మరమ్మత్తుల పనులు చేపించగా నీటిసరఫరా అవుతుంది సమస్యతీరిందని గొత్తెలు హర్షం వ్యక్తం చేశారు,, ఇక్కడ 50 కుటుంబాలు నివశిస్తున్నారు ప్రతీ రోజు తాగునీటిని తెచ్చుకుని కూలీ పనులుకు వెల్తామని గొత్తెకోయలు తెలిపారు మా సర్పంచు పిలవగానె వస్తారని సమస్యలు చూస్తారని తెలిపారు,,

**బాలకుమారస్వామి గుడిసె మరమ్మత్తులు,,,!!**

కొడిశలలొ గల బాలకుడు స్వామి గుడిసెను మరమ్మత్తు పనులు చేపించారు లింగాల సర్పంచుమొగిలిపెల్లి రవిందర్కొ లీలు గ్రామస్తులతొ కలిసి గుడిసెను సందర్సించారు శనివారం ఉదయం గాలిదుమారం,,వర్షంకురిసింది ఈక్రమంలొ గాలికిచెట్టు విరిగి గుడిసెపై పడికూలింది గిరిజనులు పూజించె బాలకుమారస్వామి గుడిసెను తిరిగి మరమ్మత్తులు చేయించెను ,,,



# నార్సింగిలో భారీ భూకబ్జా
# మోసం బట్టబయలు

- నకిలీ పత్రాలతో కోట్ల రూపాయల దందా
- తక్కువ ధరకే ప్లాట్ అంటు బురిడి కొట్టిస్తున్న మోసగాళ్ళు
- బృందావన్ కాలనీలో ప్లాట్ కొనేముందు ఒకటికి పదిసార్లు పత్రాలు పరిశీలించాలి
- ప్రజలకు నార్సింగి పోలీసుల సూచన




**రాజేంద్రనగర్ ఏప్రిల్ 03 డిడి 9 వార్త**

నార్సింగిలో భారీ భూకబ్జా మోసం బట్టబయలయ్యింది.

నకిలీ పత్రాలతో కోట్ల రూపాయల దందాకు తెరలేపి అమాయక ప్రజలకు కుచ్చుటోపీ పెడుతున్నారు. తక్కువ ధరకే ప్లాట్ అంటు బురిడి కొట్టిస్తున్న మోసగాళ్ళు.బృందావన్ కాలనీలో ప్లాట్ కొనేముందు ఒకటికి పది సార్లు పత్రాలు పరిశీలించాకే కొనుగోలు చేయాలని ప్రజలకు నార్సింగి పోలీసులు సూచిస్తున్నారు.

గండిపేట మండలం నార్సింగి పరిధిలోని బృందావన్ కాలనీలో భూముల విషయంలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. అర్బన్ ల్యాండ్ సీలింగ్ అథారిటీ లేట్ పి.వి.కుటుంబ రావు కుటుంబ సభ్యుల మధ్య భూములపై హైకోర్టులో వివిధ సివిల్ వివాదాలు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో, ఈ వివాదాస్పద భూములను టార్గెట్ చేస్తూ కొందరు దుండగులు నకిలీ పత్రాలతో అమాయక ప్రజలను మోసం చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం, 1960- 1970 కాలంలో ఈ భూములు అమ్మినట్లుగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, వాటిని అసలైనవిగా చూపిస్తూ బ్రోకర్లు,ఏజెంట్ల ద్వారా ప్రజల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు.ఈ కేసులకు సంబంధించి ఇప్పటివరకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో నమోదైన 20 కేసుల్లో సుమారు 30 మందిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ నేల 02 వ తేదీన మరో కేసు నమోదైంది.బృందావన్ కాలనీలోని సర్వే నం.146లో ప్లాట్ నం.30, 31, 32, 33,లకు చెందిన సుమారు 2000 గజాల భూమిని లేట్ అన్నపూర్ణమ్మ కూర రంగారెడ్డికి విక్రయించినట్లుగా నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసేందుకు ప్రయత్నించిన ఘటన బయటపడింది.ఈ మేరకు కుటుంబరావు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి,నకిలీ పత్రాల సృష్టిలో కీలకంగా ఉన్న కూర సమ్మోహన్ రెడ్డి,

రాజేంద్రచారిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

ఇంకా ఈ నకిలీ పత్రాల తయారీలో భాగమైన ఇతరుల పై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.నిత్యం వివాదాలతో పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతున్న బృందావన్ కాలని భూముల వ్యవహారం పై నార్సింగి పోలీసులు ప్రజలకు కీలక సూచనలు జారీ చేశారు.బృందావన్ కాలనీలో భూములు కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా న్యాయ నిపుణుల సలహా తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు,పూర్వపు లింక్ డాక్యుమెంట్లు పూర్తిగా పరిశీలించాలి,రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సంప్రదించి పత్రాల నిజస్వరూపం నిర్ధారించుకోవాలి,

ముఖ్యంగా 1960-1970 కాలానికి చెందిన పాత డాక్యుమెంట్ల విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలి.

తక్కువ ధరకు భూములు అమ్ముతున్నామని చెప్పినపుడు అనుమానం కలిగి పూర్తిస్థాయిలో విచారణ చేయాలి.నకిలీ పత్రాల ద్వారా ఎవరైనా మోసం చేసినా, లేదా అనుమానాస్పద వ్యవహారాలు గమనించినా వెంటనే నార్సింగి పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

## జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నేడు పంట మార్పిడి పై రాష్ట్ర స్థాయి సదస్సు

**రాజేంద్రనగర్ ఏప్రిల్ 03 డిడి 9 వార్త**



పంట మార్పిడి ప్రాముఖ్యత పై చర్చించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి అల్దాస్ జానయ్య వెల్లడించారు.వ్యవసాయ రంగంలో మారుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని,అధిక దిగుబడులతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.పంట మార్పిడే ఆరోగ్యకరమైన ఆహార వ్యవస్థకు పునాది అని స్పష్టం చేశారు.ఈ సదస్సులో రైతు సంఘాల ప్రతినిధులు, అభ్యుదయ రైతులు, శాస్త్రవేత్తలు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని పంట మార్పిడిపై తమ అభిప్రాయాలు,సూచనలు తెలియజేయనున్నారు. ముఖ్యంగా రసాయనాల వినియోగాన్ని తగ్గించడం, భూమి సారాన్ని కాపాడటం, స్థిరమైన వ్యవసాయం ప్రోత్సహించడం వంటి అంశాలపై చర్చ జరగనుంది.

సదస్సులో వ్యక్తమైన సూచనలు,అభిప్రాయాలను సమగ్రంగా సేకరించి పంట మార్పిడిని ప్రోత్సహించే విధానాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు ఉపకులపతి అల్దాస్ జానయ్య తెలిపారు.

వ్యవసాయంలో స్థిరత్వం, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి కోసం పంట మార్పిడి కీలకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మేడారం నాసిరకం నిర్మాణాలకు సాక్ష్యం

- శిలలు రాలి పడి గాయపడిన బాలుడు
- ఏడేళ్ల బాలుడి ఎడమ కాలు తొలగించిన వైద్యులు
- బాలుడి విషాదంతో బయటపడిన నిర్మాణ లోపాలు





**మంగపేట ఏప్రిల్ 3,(డిడి9 వార్త)**

మేడారం జాతర... కోట్లాది భక్తుల విశ్వాసానికి ప్రతీక. కానీ అదే జాతరలో నాసిరకం నిర్మాణాలు ఒక చిన్నారి జీవితాన్ని చీకటిలోకి నెట్టిన విషాద ఘటన వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. గద్దెల వద్ద అమర్చిన రాతి శిలలు రాలిపడటంతో ఏడేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడి, చివరకు తన ఎడమ కాలును కోల్పోవాల్సి వచ్చింది. ఈ ఘటన భక్తి పేరుతో జరుగుతున్న అభివృద్ధి పనుల అసలు స్వరూపాన్ని బయటపెట్టింది.

అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, నిర్మాణాల్లో నాణ్యత లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సురక్షిత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక చిన్నారి జీవితాంతం వికలాంగుడిగా మారాల్సి వచ్చిన ఈ ఘటన కేవలం ప్రమాదం కాదు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు.

ఇలాంటి ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్న అధికారులు, కాంట్రాక్టర్లు తమ బాధ్యతను విస్మరించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పూజారులు, స్థానిక నిర్వాహకులు కూడా నిర్మాణాల నాణ్యతపై ముందుగానే ప్రశ్నించాల్సింది పోయి మౌనం వహించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఈ విషాదం తర్వాత అయినా అప్రమత్తమవుతుందా..? భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తుందా..? లేక ఇలాంటి ఘటనలు పునరావృతమవుతూనే ఉంటాయా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

బాధిత బాలుడికి తక్షణ సాయం అందించడమే కాకుండా, ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.